# పెండ్లిపిలుపు

"పోస్ట్!" అన్న కేక విని పేపరు చదువుకుంటున్న రామచంద్రయ్యగారు తలెత్తి వీధివంక చూశాడు. పోస్టుమాన్ ఒక పెద్ద శుభలేఖ ఇచ్చి వెళ్ళాడు. ఉత్తరం మీద దస్తూరి చూడగానే అంతులేని ఆశ్చర్యం కలిగింది. వణుకుతున్న చేతులతో లోపల శుభలేఖ వంక చూశాడు. అంతులేని ఆనందం కలిగింది. సాగరగర్భంలో దాగిన పెన్నిధి దొరికినట్టు - ఆడబోయిన తీర్థం ఎదురైనట్టు తరతరాలుగా కొలిచిన దైవం తనకు తానై దిగివచ్చినట్టు అనిపించింది.

మనస్సు గద్గదమైంది. ఎంతో ఆనందం కలిగింది. అంత ఆవేశమూ కలిగింది.

శాంతా ! శాంతా ! అంటూ కేకవేశాడు.

"ఏమిటండి? ఏమిటి హడావిడి" అంటూ శాంత లోపలనుంచి వచ్చింది.

"చూడవే యీ శుభలేఖ చూడు!" అంటూ ఆవిడకు ఇచ్చాడు.

ఆవిడి ఆ శుభలేఖ వంక చూస్తూ చదవకుండానే ఏమిటండి అసలు విశేషం? "ఎవరిది పెళ్ళి?" అని అడిగింది.

"చదువుకోవే తెలుస్తుంది! ఇంత కాలంబట్టి ఎన్ని మాటలనుకుంటున్నాం, ఎన్నిరకాలుగా అనుకుంటున్నాం, ఏమైనా రక్తసంబంధం రక్తసంబంధమే ! ఏదో చెడురోజులొచ్చాయి, మాటా, మాటా అనుకున్నాం. విడిపోయాం. అంతమాత్రాన మా చుట్టరికాలు పోతాయా? ఆపేక్షలు, అంతఃకరణలు పోతాయా?

అందుకనే ఇంట్లో శుభకార్యం అనగానే మొట్టమొదటగా నాకే పంపించాడు మా అన్నయ్య శుభలేఖ"

ఆవిడ ముభాంగా "మంచిదే" అంటూ లోపలికి వెళ్ళింది. నెమ్మదిగా లోపలికి వెడుతున్న శాంత వంక రామచంద్రయ్యగారు ఒక్కసారి చూశాడు.

వయస్సు రాకుండానే మనిషికి వృద్ధాప్యం వచ్చింది. జుట్టు తెల్లబడింది. చర్మం ముడతలు పడ్డది. కళాకాంతులు ఏనాడో తగ్గిపోయాయి. కట్టుకున్న చీరె మీద చీలికలు, వాలికలు. ఆకాశంలో నక్షత్రాలన్నీ అతుకులు మాసికలు.

ఒడిదుడుకులు ఎన్ని వచ్చినా తరగనిది చెరగనిది ఆ మనిషి ముఖంలోని చిరునవ్వే !

"శాంతా ! శాంతా !" అంటూ ఆయన మళ్ళీ పిలిచాడు.

"ఏమిటండి? ఎందుకు అనవసరంగా పిలుస్తారు" అంటూ చిరాకుగా ఉన్న ఆయనముఖం చూడగానే ఏమనుకుందో ఏమో,దగ్గరకు వచ్చి నెమ్మదిగా "ఏమిటండి

అని అడిగింది.

"కూర్చో శాంతా ! ఒక్క క్షణం నా దగ్గర కూర్చో" అని ఆయన అన్నాడు. ఆయన దగ్గరకువచ్చి కూర్చొని మెల్లగా "ఏమిటండి?" అన్నది.

రామచంద్రయ్యగారు ఒక్క క్షణం మాట్లాడలేదు. ఆవిడ ముఖం వంక చూస్తూ ఊరుకున్నాడు.

"చూడు శాంతా ! ఒక్కమాట అడగనా?" అని ఆయన అన్నాడు.

"అడగండి"

"ఏమీలేదు శాంతా ! నన్ను కట్టుకుని నువ్వు సుఖపడలేదేమో అని అనుకుంటున్నాను. జీవితమంతా కష్టాలే అనుభవించావు నాకోసం. నిన్ను నేను సుఖపెట్టలేకపోయాను.

శాంత క్షణ కాలం మాట్లాడలేదు. ముఖంలో ఆవేదన కనిపించి మాయమైంది. 'ఇప్పుడా మాటలన్నీ ఎందుకు" అన్నది.

ఏమో అల్లాగే అనిపిస్తుంది శాంతా !

"నన్ను కాదని నువ్వు ఎవరిని చేసుకున్నా నువ్వుచాలా సుఖపడి వుండేదానివేమో!

ఈ మాటలు విని ఆవిడ కిల కిలా నవ్వింది. "ఏమండి ఇవన్నీ మన చేతుల్లో వున్నాయా, కావాలంటే కట్టుకోవడానికి వద్దంటే తెంచుకోవడానికి?" ఇది ఎన్ని జన్మల సంబంధమో ! ఎన్ని యుగాల అనుబంధమో ! సొమ్ము పోయినా మన ప్రేమలు పోలేదుగా? మనస్నేహం పోలేదుగా ! ఎందుకండీ, మీరు అనవసరంగా బాధపడతారు? నాకేమిటి నేను సుఖంగానే వున్నాను, నా అంత అదృష్టవంతురాలు ఎవరూలేరని ఎప్పుడూ అనుకుంటాను, మీరేం దిగులుపడకండి అనవసరంగా"

నేను సంతోషంగానే వున్నాను. మనిషికి కావలసింది స్నేహం ! సంతృప్తి,! ఆస్తిపాస్తులు కాదు.

అనుక్షణం మనుష్యులని రాచిరంపాన పెట్టే ఆస్తిపాస్తులుంటే ఒరిగే సుఖం ఏముందిలేద్దురూ ?

ఈనాడు మనకు వచ్చిన లోటు ఏమిటి? మనం ఇద్దరం సలక్షణంగా వుంటిమి ! అన్నీ వున్నాయి మనకు, సుఖంగా వున్నాం మనం.

మీ నీడలో నేను ఎప్పుడూ సుఖంగానే వున్నాను. నాకేం కష్టం కలగలేదు మీ దగ్గర !

"మీరేం దిగులు పడవద్దు. నేను సంతోషంగానే వున్నాను" అంటూ చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నం చేస్తూనే పమిటకొంగుతో కన్నులు ఒత్తుకుంది శాంత.

నువ్వీమాట అంటావని నాకు తెలుసు శాంతా ! ఇరవైయేళ్ళ బట్టి యీ మాటే అంటున్నావు. కంటతడి పెట్టుకుంటూనే వున్నావు నువ్వు ఎన్నిసార్లు చెప్పినా, ఎన్ని తీయనిమాటలు చెప్పి నాకు నచ్చచెప్పాలని ప్రయత్నం చేసినా నిజం నాకు తెలుసు శాంతా !

నువ్వు ఓడిపోయావు !నేను అంతకన్నా ఓడిపోయాను.

ఓడిపోయిన యీ మనిషి నీడలో నిలబడి నువ్వు దుఃఖాన్నే పంచుకున్నావు. కష్టాలు అనుభవించావు. సుఖాన్ని పొందలేకపోయావు.

అందుకనే అనుకుంటాను, ఏదో జన్మలో నావాళ్ళు అందరికీ దుఃఖాన్నే కలిగించాను, బాధలే పంచియిచ్చాను.

అందరూ వుండి ఎవ్వరూలేని వాడినైయ్యాను. అందరకూ కావలసికూడా ఏకాకినైయ్యాను.

అందుకనే నాలాంటి జన్మ ఎవ్వరికీ రాకూడదని అనుక్షణం అనుకుంటూ వుంటాను. శాంత ఏం మాట్లాడలేదు. ఒక్క క్షణం అతనివంక చూసింది. అనంతంలోకి చూసింది. అతని చేతిని తన చేతిలోకి తీసుకుని.

"ఏమండి! ఏమండి ! ఒక్క మాట చెప్పనా. చిరునవ్వుతో నన్ను పలుకరించండి ! అదే మనకు లక్షలు కోట్లు మీరు ఏకాకి ఎందుకవుతారు? నేను మీకు వున్నాను. మీరు దుఃఖపడుతూ వున్నారంటే నేను మిమ్మల్ని సుఖపెట్టలేకపోతున్నా ననిపిస్తుంది. అనుక్షణం మీ బాధతో నన్ను కించపరచకండి. నా లోపం ఏమన్నా వుంటే నన్ను క్షమించండి" అని అంది.

రామచంద్రయ్యగారు అంతలోనే తెప్పరిల్లుకున్నారు. దుఃఖమంతా ఏమైందో ఏమో ?? మబ్బులు విడిచిన వెన్నెలలాగా ఒక్కసారి మందహాసం చేశాడు.

చూడు శాంతా ! అన్నయ్యకు మనమంటే ఎంత ప్రేమో ! కూతురు పెళ్ళి లనగానే ఎంత పెద్ద శుభలేఖ పంపించారో ! !

అప్పుడే మన సుశీలకు పెళ్ళి యీడు వచ్చింది. పెద్దదైయింది ! ఏనాడో చంటిపిల్లగా చూశాము ! ఎల్లావుందో ఈ బాబాయిని గుర్తుపడుతుందో లేదో ? వెడితే పలుకరిస్తుందంటావా మనల్ని?"

"సుశీల పలుకరించడాని కేముంది? సుశీల మనల్ని పలుకరిస్తుంది. మిగతా వాళ్ళ మాటే నాకు అనుమానం" అని శాంత అన్నది.

లేదు శాంతా నువ్వలా అపోహపడకు. అన్నయ్య మనస్సు చాలా మంచిది. వాడు గంగిగోవులాంటి మనిషి ... అప్పుడు మన పొరబాటువల్ల మన దురదృష్టవల్ల వాడూ మనం వేరైయ్యాము కాని వాడి తప్పేముంది?

ఎవరైనాసరే తాము కష్టపడి సంపాదించింది నాశనమై పోతోందంటే ఎల్లాగో అల్లా దానిని నిలబెట్టుకోడానికి ప్రయత్నం చేస్తారు. అవసరమైతే బంధువులతో తెగతెంపులు చేసుకుంటారు. స్నేహాల్ని పోగొట్టుకుంటారు. అంతే కాని జీవితమంతా చెమటోడ్చి సంపాదించినదాన్ని చూస్తూ చూస్తూ పోగొట్టుకోలేరు గదా !

వాడూ మనిషే ... మనలాంటి మనిషే... మన చేతులలో వుంటే అదే యీ నష్టజాతకుడి చేతులోవుంటే సర్వస్వం నాశనం అవుతుందని భయపడి మనకు దూరమైయ్యాడు కాని మన బంధుత్వానికి దూరం కాలేదుగా ! ! !"

"మీ ఆక్షేపణలు అంతఃకరణలునాకు అర్థంకావు. లాభం ఆయన తీసుకున్నాడు. నష్టం మీ నెత్తిన రుద్దాడు. అందలం ఆయన ఎక్కాడు అధోగతిపాలు మీరు అయ్యారు.' ' అని శాంత అన్నది.

అల్లా అనకు శాంతా ! బాధ్యత తీసుకున్నవాడే బరువుకూడా మోయ్యాలి. ఇందులో అన్నయ్య తప్పేమీ లేదు.

"ఏమోనండి మీ మాటలేం నాకు అర్థంకావు" అని శాంత అన్నది.

"చూడు శాంతా ! పెళ్ళి రెండు రోజులేవుంది !బట్టలు అవీ సర్దుకో ! మనం ముందుగా వెళ్ళకపోతే అన్నయ్య ఏమన్నా అనుకుంటాడు, అదుగో అన్నట్టు శాస్త్రుల్లగారి యింటికి వెళ్ళి ఒక పదిరూపాయలు చేబదులు పట్టుకురా ప్రయాణానికి కావాలి !

ఏదో చెబుదామనుకుంటూ శాంత ఆయనవంక చూసింది. అంతలోనే మనస్సు మార్చుకుని లోపలికి చక్కాపోయింది.

శాంత లోపలకు వెళ్ళిన తరువాత రామచంద్రయ్యగారు బట్టపెట్టె తీసి బట్టలు సర్దడం మొదలుపెట్టాడు.

ఉన్న బట్టలన్నీ లెక్కచూస్తే మూడు పంచలు రెండు చొక్కాలు, రెండు బాగా చిరిగినవి, ఒకటి ఇప్పుడిప్పుడే చిరుగుపట్టింది చొక్కాలుమాట చెప్పనక్కర్లేదు. అవి ఎప్పటివో వాటి అసలు అందచందాలు ఏమైనాయో ?

ఒక పాత కోటు, ఇక్ష్వాకులనాటిది. దాని అసలు సిసలు రంగేమిటో ఎవరి కెరుక? వెలిసిపోయి వెలా వెలా పోతోంది.

జరీ మాడిపోయిన పాత ఉత్తరీయం. వీటికితోడు చిరిగిపోయిన పాతగొడుగు.

తన బట్టలు యిల్లా వున్నాయి. మరి శాంత మాటేమిటీ? తనకు వున్నవే రెండే రెండు !!

అన్నయ్య వాళ్ళ యింట్లో అంతా బెనారసు చీరెలు, కంచిపట్టు చీరెలలో తిరుగుతూవుంటే - వాళ్లమధ్య యీ చింకిపాతలలో, యీ వెలసిపోయిన బట్టలతో మూసివాయనం ముత్తైదువులాగా పెద్దమ్మవారులాగా శాంత తిరుగుతూ వుంటే అన్నయ్య ఏమనుకుంటాడు? వదినే ఏమనుకుంటుంది?

పోనీ చాకలివాడింటికి వెళ్ళి పడితలకు బట్టలు తెచ్చుకుంటే !

వాడితో చెబుదాం, ఒరేయి వెంకా ! అన్నయ్య గారింటికి పెళ్ళికి వెళ్ళాలిరా నాకూ, అమ్మగారికి మూడు జతల బట్టలు కావాలిరా అని అడిగితే వాడు తప్పక ఇస్తాడు. ఈ నాలుగు రోజులు అవే కట్టుకుందాం, తను చిరిగిపోయిన బట్టలు కట్టుకుంటే అన్నయ్య బాధ పడతాడు.

ఈ కొత్త బట్టలు ఎక్కడివని అన్నయ్య నిగ్గదీసి అడుగడుగా ! చాకలి వాడిదగ్గర పడితలకు తెచ్చుకున్నారా ! అని వేళాకోళం చెయ్యడుగదా !

అందరూ అన్ని రకాల వస్తువులు తీసుకునివచ్చి ఎన్నో కానుకలు యిస్తారుగా !

తను ఏం యివ్వగలడు? ఇవ్వడానికి యీ యింట్లో ఏముంది? సూర్యచంద్రులు కనిపిస్తున్న పాక. ఎండిపోయి బీటలు వారి ఎందుకూ పనికిరాకుండా బీడుపట్టిన పొలం.

కాయని చెట్లు, పూయని పువ్వులు, పండనిపొలం. ఇవి తనకు చివరకు మిగిలింది. వీటిలోంచి తనేం తీసుకుని వెళ్ళి యివ్వగలడు సుశీలకు ! అక్కడకు వెళ్ళి అనుక్షణం తన పేదరికం వల్ల అన్నగారిని కించపరచడమే గాని

పోనీ యీ పెళ్ళికి వెళ్ళకపోతే?"

అన్నయ్య అంత ఆపేక్షగా శుభలేఖ పంపించాడు. రెండు రోజులు ముందుగానే తెలియపరిచాడు. వెళ్ళకపోతే అన్నయ్య ఏమనుకుంటాడు? వదినేమనుకుంటుంది? ఉన్న

ఒక్క బాబాయి రాలేదని సుశీల ఎంత బాధపడుతుందో?

లేదు, ఏదో విధంగా వెళ్ళాలి ! తల తాకట్టు పెట్టయినా సరే వెళ్ళాలి.

ఇల్లు అమ్మేస్తే ?

పొలం అమ్మేస్తే డబ్బు తీసుకుని వెడితే?

బాగానేవుంది రోడ్డు ప్రక్క పొలం. నలభై సెంట్లు. ఎంత హీనపక్షంగా చూద్దుకున్నా మూడువేలు రాకపోవు?

అందులో రెండువేలు పెట్టి సుశీలకు ఒక చిన్న నగ చేయించి పెట్టవచ్చు అన్నయ్యకు బట్టలు పెట్టవచ్చు. వదినెకు మంచి పట్టుచీరె కొనిపెట్టవచ్చు. అవును అందరి విషయం గుర్తుంది, కాని అల్లుడి విషయమే మరిచిపోయాను. ఇహనుంచి అతనూ మన ఇంటివాడేగా ! అతనికి కూడా ఏమైనా యిద్దాం ! మంచి సూటు కొనిపెడదాం?

తరువాత?

తరువాతకేముంది? ఇంతకాలం బ్రతకలేదా? అల్లాగే ఇహముందు కూడా బ్రతకవచ్చు ! ఇంతకాలం రైతుగా బ్రతికాం, ఇహముందు పాలేరుగా బ్రతకచ్చు. కష్టపడటం తనకు అలవాటేగా!

'ఎప్పటినుంచో పెద్దయ్యగారు అంటూనేవున్నారు. ఎందుకురా రామచంద్రయ్యా అల్లా అవస్థపడతావు, నలభైసెంట్లు పొలంతో ఏం సాంపాదిస్తావు? ఎల్లా బ్రతుకుతావు?'

ఆయన దగ్గరే వుంటే హాయిగా ముప్పైబస్తాలు యిస్తాడు. అదే బాగుంటుంది. ఆయనకే యీ పొలం అమ్మేస్తే అవును యీ పొలం ఆయనకు కలుస్తుంది. ఈపొలం ఆయనకే అమ్మేద్దాం.

డబ్బు ఎప్పుడు పడితే అప్పుడు యిస్తాడు ఆయన.

ఆ డబ్బు తీసుకుని వెడితే అన్ని సమస్యలు తీరిపోతాయి. అందరికీ సుఖంగా వుంటుంది.

అంతే యీ నిశ్చయం రావడమేమిటి, కొండ ఎక్కినంత సంబరం వేసింది. మబ్బులన్నీ తొలగిపోయాయి. ఏదో సాధించాననే ధైర్యం, సంతృప్తి కలిగింది.

శాంతా ! శాంతా ! బయలుదేరుతున్నావా? బట్టలు సర్దావా? అంటూ బిగ్గరగా పిలిచాడు.

శాంత బట్టలు సర్దుకోలేదు. ప్రయాణానికి సిద్ధం కాలేదు. మెల్లి మెల్లిగా దగ్గరకు వచ్చింది ! "మీరు శుభలేఖ చదివారా?" అని నెమ్మదిగా అడిగింది.

ఒక్కసారేమిటి? ఒకటికి పదిసార్లు చదివాను ! స్వస్తి శ్రీ చాంద్రమాన సంవత్సరం అని రాశివుంది ! అన్నయ్య, వదిన పేరువుంది, తరువాత అమ్మాయి పేరువుంది. సుశీల! చిరంజీవి సౌభాగ్యవతి సుశీలకు ఫలాని బావగారి కుమారుడు అదే అతని పేరేమిటి? శ్యామలరావు ఎమ్.బి.బి.ఎస్. ఎఫ్.ఆర్.సి.ఎస్.కు ఇచ్చి పదహారవ తారీఖున వివాహం అని వుంది. అంతకంటే యింకా ఏం కావాలి శాంతా?

దయచేసి మళ్ళీ ఒక్కసారి చదవండి" అని శాంత అతన్ని అర్థించింది.

శుభలేఖ తీసుకుని మళ్ళీ చదివాడు. "మళ్ళీ మళ్ళీ చదవటానికి ఏముంది!" అంటూ కసురుకున్నాడు.

ఎప్పుడూ కలగని చిరాకు యీనాడు శాంతమీద కలిగింది.

శాంత అతనిదగ్గర కూర్చొని నెమ్మదిగా "ఏమండి పెళ్ళి క్రిందటి నెల పదహారో తారీఖున అయిపోయిందండీ. శుభలేఖ నెలరోజులు ఆలస్యంగా వచ్చింది'' అని అన్నది.

రామచంద్రయ్యగారు ఏం మాట్లాడలేదు. శాంతవంక చూశాడు. ఏదో చెబుదామనుకున్నాడు. ఏదో మాట్లాడుదామనుకున్నాడు. మళ్ళీ అంతలోనే తెప్పరిల్లుకుని,

"అమ్మాయి కాపురానికి కూడా వెళ్ళిపోయి వుంటుంది కదా?'' అని అన్నాడు.

"వెళ్ళిపోయి వుంటుంది'' అంటూ శాంత లోపలికి వెళ్ళిపోయింది.

రామచంద్రయ్యగారు ఆ శుభలేఖ వంక మళ్ళీ మళ్ళీ చూచుకున్నాడు. ఈ సారి పూర్తిగా చదివాడు.

క్షణకాలం పోష్టలు డిపార్టుమెంటు మీద కోపం వచ్చింది. కాని ఆ ఉత్తరం క్రిందటిరోజునే డబ్బాలో పడ్డట్టు ముద్రచెబుతోంది.

అంటే?

అన్నయ్య కావాలనే యిల్లా చేశాడా?

ఇరవై సంవత్సరాలు గడిచిపోయినా కక్షలు మరిచిపోలేదా ! ఏమో అన్నయ్య ఇల్లా చేశాడంటే నమ్మకం కుదరటంలేదు !! అన్నయ్య అల్లాంటి మనిషి కాదు.

ఏమో ? ఏమో!

ఎండిపోయిన చెట్టుమీద కాకి అరుస్తూనే వుంది.

శిధిలమైన యింట్లోకి సూర్యచంద్రులు తొంగిచూస్తున్నారు.

బీడువారిన చౌడు పొలం తనని చూసి నవ్వుతోంది.

చిరిగిపోయిన గాలిపటం చెట్టుకొమ్మన విలవిల్లాడుతోంది.

ఎన్నడూ చిన్నబోవని హృదయం యీనాడు చిరుగుపట్టింది.

(ఆకాశవాణి మదరాసు కేంద్రం సౌజన్యంతో)

# క్షమయాధరిత్రీ !!

"తమ కోసరం ఎవరో ముసలాయన వచ్చారు" అని నా దగ్గర పనిచేసే కుర్రవాడు అన్నాడు.

"లోపలకు రమ్మని చెప్పు''

ఆయన లోపలకు వచ్చాడు, నాకోసం రోజూ అనేకమంది అనేక రకాల పనులమీద వస్తారు. ఈ ముసలాయన కూడా ఆ రకమేనని అపోహ పడ్డాను.

ఆయన్ను చూడగానే ఉలిక్కిపడ్డాను.

నన్నుచూసి ఒగున చిరునవ్వు నవ్వి "ఇంకా గుర్తున్నానా?'' అని అడిగారు.

ఎంతమాట. మిమ్మల్ని మరిచిపోవటమా? ఇదంతా మీ చలవేగా.

"గుమ్మం బయట కూర్చున్న బంట్రోతు కుర్రవాడు నా మనస్సు గ్రహించాడో ఏమో?''